క్లుప్తంగా

ప్రతిష్టకు సిద్ధమైన శివాలయం

జి.కొండూరు: జి.కొండూరులో నూతనంగా నిర్మించిన పార్వతీదేవి సమేత అమృత లింగేశ్వరస్వామి ఆలయంలో ద్వజస్తంభ, విగ్రహ ప్రతిష్టామహోత్సవం ఈ నెల 19వ తేదీన ఉదయం 9.43 గంటలకు జరగనుంది. ఈ కార్యక్రమంలో భాగంగా 17వ తేదీ శుక్రవారం ఉదయం 9గంటలకు గణపతిపూజతో పూజా కార్యక్రమాలు మొదలు కానున్నాయి. ప్రతిష్టా మహోత్సవం అనంతరం అన్నదాన కార్యక్రమం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు.

పరమశివుడికి పూజలు

గంపలగూడెం: కార్తికమాసం ప్రారంభం సందర్భంగా మండలంలోని పలు శివాలయాల్లో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయా ఆలయాల్లో మహేశ్వరునికి ఉదయాన్నే పంచామృతాలతో అభిషేకం చేసి ప్రత్యేక అలంకరణ చేశారు.

విస్సన్నపేటలో..

విస్సన్నపేట: స్థానిక గంగాపార్వతి సమేత చంద్రశేఖరస్వామి దేవస్థానంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆకాశదీపం పూజా కార్యక్రమాలు, లలితా సహస్రనామార్చన కార్యక్రమం నిర్వహించినట్లు ఆలయ చైర్మన్ కుక్కడపు హనుమాన్ వెంకటరత్నం, ఆలయ ఈఓ సీతారామయ్య తెలిపారు.

శ్మశాన వాటికకు స్థలం కేటాయింపు

ఆగిరిపల్లి: మండలంలోని తోటపల్లికి సంబంధించి శ్మశాన వాటికకు స్థలాన్ని కేటాయిస్తూ కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ ఉత్తర్వులు జారీ చేశారు. గ్రామానికి సమీపంలోని ప్రభుత్వ స్థలం సర్వే నంబరు 97/2లో ఎకరం భూమిని కేటాయించారు. ఈ కేటాయింపు ఉత్తర్వుల ప్రతిని తహసీల్దార్ ఎం.ఉదయభాస్కర్ మంగళవారం సర్పంచ్ ఆరేపల్లి పద్మ, గ్రామ పెద్దల సమక్షంలో సచివాలయం సెక్రటరీకి అందజేశారు.

దుప్పట్ల పంపిణీ

రెడ్డిగూడెం: మండలంలోని అన్నేరావుపేట గ్రామ సచివాలయం పరిధి సీతారామపురంలో వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు పాలిమెట్ల శరత్‌బాబు వృద్ధులు, వితంతువులు, వికలాంగులకు దుప్పట్లను మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్టీఆర్ జిల్లా వ్యాప్తంగా అనేక సేవా కార్యక్రమాలతో పాటు పేదలకు తనవంతుగా సాయం చేసేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. కార్యక్రమంలో మైలవరం నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు వీరమళ్ల సుధాకర్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు తిరుపతి రావు, వైస్ ఎంపీపీ రాబర్టు, రెడ్డిగూడెం సర్పంచ్ మల్లాది రాణీ, కూనపరాజుపర్వ సర్పంచ్ వెంకటేశ్వరరావు, రంగాపురం సర్పంచ్ సునీల పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

కోనేరుసెంటర్: ఈ నెల 18వ తేదీన విజయవాడలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఐటీ విభాగం ఆధ్వర్యంలో జరగనున్న జగనన్న ప్రగతిరథం పోస్టర్‌ను మంగళవారం ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, బందరు ఎమ్మెల్యే, రాష్ట్ర మాజీ మంత్రి పేర్ని వెంకట్రామయ్య (నాని) ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఐటీ విభాగం రాష్ట్ర కోఆర్డినేటర్ వేముల కొండతిరుపతిరావు, జిల్లా ఐటీ విభాగం అధ్యక్షుడు పూర్ణసాగర్, ఐటీ విభాగం సభ్యులు పాల్గొన్నారు.

ఇరువర్గాలపై కేసు నమోదు

రెడ్డిగూడెం: మండలంలోని రాఘవాపురంలోని బీసీ కాలనీలో సోమవారం రాత్రి ఇరువర్గాలు కర్రలు, రాళ్లతో దాడి చేసుకుంటున్న సమయంలో వారిని వారించే క్రమంలో కానిస్టేబుల్ సీహెచ్ శివన్నారాయణ గాయపడ్డాడు. తన విధులకు ఆటంకం కలిగించి తనపై దాడికి పాల్పడినట్లు వారిపై శివన్నారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై కేసు నమోదు చేశారు. మైలవరం సీఐ మోహన్‌రెడ్డి దర్యాప్తు చేసి 27 మందిని అరెస్టు చేసి మంగళవారం రాత్రి మైలవరం జడ్జి ముందు హాజరు పర్చినట్లు ఎస్సై తెలిపారు. అదేవిధంగా ఇరువర్గాల ఘర్షణకు సంబంధించిన సంఘటనలో 12 మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రీను పేర్కొన్నారు.

వైఎస్సార్ సీపీ హయాంలోనే అభివృద్ధి, సంక్షేమం

ఎమ్మెల్యే రక్షణనిధి

వినగడప(గంపలగూడెం): రాష్ట్రంలో చేసిన అభివృద్ధి, అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరించే సత్తా వైఎస్సార్ సీపీకి మాత్రమే ఉందని తిరువూరు ఎమ్మెల్యే కే రక్షణనిధి తెలిపారు. గంపలగూడెం మండలం వినగడపలో మంగళవారం రాత్రి నిర్వహించిన పల్లెకు పోదాం, వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాల్లో ఆయన మాట్లాడారు. ముందుగా గ్రామంలో అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలకు సంబంధించి డీస్‌ప్లే బోర్డును ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గడచిన నాలుగున్నర సంవత్సరాల్లో గ్రామంలో రూ. 25 కోట్లతో అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు పరిచామన్నారు. పథకాల అమలులో ఎలాంటి రాజకీయ వివక్షత చూపకుండా అర్హతే ప్రామాణికంగా అమలు పరచిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందన్నారు. గ్రామస్తుల విజ్ఞప్తి మేరకు వినగడప పంచాయతీ పరిధిలోని శివారు గ్రామాల్లో సైతం సెల్ సిగ్నల్ అందేవిధంగా అవసరం ఉన్న టవర్ల నిర్మాణం కొనసాగుతుందని, త్వరలో సమస్య పరిష్కరిస్తామన్నారు. కట్లేరుపై హై బ్రిడ్జి నిర్మాణం త్వరలో ప్రారంభిస్తామని తెలిపారు. ఎంపీపీ గోగులమూడి శ్రీలక్ష్మి, అచ్చం పేరంటాలమ్మ చైర్మన్ ఎం.నాగమల్లేశ్వరరావు, సొసైటీ అధ్యక్షుడు పి.ఆంజనేయులు, సర్పంచ్ సీహెచ్ ఉమాదేవి, ఎంపీటీసీ సభ్యురాలు పి.పద్మ, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు వెంకటేశ్వరరావు, మాజీ ఎంపీపీ కే దాసు, జిల్లా కమిటీ సభ్యులు సీహెచ్ నరసారెడ్డి, జి.చెన్నకేశవరెడ్డి, మీసాల కోటి, గోసు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ప్రజల సంక్షేమం కోసం పాటుపడుతున్న వైఎస్ జగన్

నూజివీడు: రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం పాటుపడుతోందని, అన్ని వర్గాల ప్రజల సంక్షేమం కోసం పాలన సాగిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఈ రాష్ట్రానికి మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని మున్సిపల్ చైర్‌పర్సన్ రామిశెట్టి త్రివేణీదుర్గ అన్నారు. వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని 14వ వార్డు సచివాలయంలో సంక్షేమ పథకాల వల్ల కలిగిన లబ్ధిని తెలియజేసే బోర్డును చైర్‌పర్సన్ త్రివేణీదుర్గ మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సంక్షేమ పథకాలన్నీ కొనసాగాలన్నా, మధ్య, పేద వర్గాలు అభివృద్ధి చెందాలన్నా ప్రజలందరూ జగన్‌కు అండగా నిలవాలన్నారు. దాదాపు 33 సంక్షేమ పథకాల ద్వారా 14వ వార్డు సచివాలయం పరిధిలోని 27, 28 వార్డుల్లో రూ.24.33 కోట్లను లబ్ధిదారులకు ఈ నాలుగున్నరేళ్లలో ప్రభుత్వం అందజేసిందన్నారు. అనంతరం వార్డులో వైఎస్సార్ సీపీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు శీలం రాము, మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు రామిశెట్టి మురళీకృష్ణ, సచివాలయాల కన్వీనర్ పిళ్లా చరణ్, మున్సిపల్ వైస్ చైర్మన్ కొమ్ము వెంకటేశ్వరరావు, 27వ వార్డు కౌన్సిలర్ గాజుల సీతారత్నం పాల్గొన్నారు.

లబ్ధిదారులకే నేరుగా సంక్షేమ నిధులు

తిరువూరు: పేదరిక నిర్మూలనా కార్యక్రమాల్లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం పేదల బ్యాంకు ఖాతాలకే నేరుగా సంక్షేమ పథకాల నగదును జమ చేస్తోందని తిరువూరు నగర పంచాయతీ చైర్‌పర్సన్ గత్తం కస్తూరిబాయి అన్నారు. స్థానిక 14, 15 వార్డు సచివాలయాల్లో మంగళవారం ఏపీ సీఎంగా జగనే ఎందుకు కావాలి కార్యక్రమాన్ని నిర్వహించారు. రెండు వార్డుల్లో సంక్షేమ పథకాల డిస్‌ప్లే బోర్డులను చైర్‌పర్సన్ ఆవిష్కరించిన అనంతరం మాట్లాడుతూ గత నాలుగున్నరేళ్లలో రెండు వార్డులలో రూ.20 కోట్ల మేర లబ్ధి చేకూర్చినట్లు తెలిపారు. నగర పంచాయతీ కమిషనర్ బాలకృష్ణ, వైస్ చైర్‌పర్సన్ విజయలక్ష్మి, వార్డు కౌన్సిలర్లు పసుపులేటి శేఖర్‌బాబు, మోదుగు ప్రసాద్, వార్డు కన్వీనర్ పరసా నెహ్రూజీ, వైఎస్సార్ సీపీ నాయకులు కాలసాని నాగేశ్వరరావు, తిరుమలశెట్టి వేణు, గుంటూరు మస్తాన్ పాల్గొన్నారు.

కట్టుబడిపాలెంలో..

జి.కొండూరు: మండలంలోని కట్టుబడిపాలెంలో పల్లెకు పోదాం, ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమాలను మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో వైఎస్సార్ సీపీ జెండాను ఎగురవేసిన నాయకులు, గ్రామంలో ఇప్పటి వరకు పంపిణీ చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలతో కూడిన డిస్‌ప్లే బోర్డును గ్రామ సచివాలయంలో ప్రారంభించారు. గ్రామంలో ఇంటింటికీ తిరుగుతూ సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లలా కొనసాగాలంటే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేయడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.

ఏపీకి జగన్ నాయకత్వం అవసరం

గుంటుపల్లి(ఇబ్రహీంపట్నం): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమ కోసం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రానికి అవసరం ఉందని ఎంపీపీ పాలడుగు జోత్స్న అన్నారు. గుంటుపల్లి మూడో సచివాలయం పరిధిలో మంగళవారం పల్లెకు పోదాం, ఏపీకి జగనే ఎందుకు కావాలి కార్యక్రమంలో ఆమె పాల్గొని సచివాలయం పరిధిలో రూ.17.15 కోట్లు అభివృద్ధి సంక్షేమ పనుల డిస్‌ప్లే బోర్డు ఆవిష్కరించారు. ఉప సర్పంచ్ మేరి, పంచాయతీ కార్యదర్శి జి.మునేశ్వరరావు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ బొంతా సాంబశివరావు, సచివాలయాల మండల కన్వీనర్ కోసూరు వెంకటేష్ పాల్గొన్నారు. ఇబ్రహీంపట్నం నాలుగో సచివాలయంలో జరిగిన అభివృద్ధి సంక్షేమ పనులు, లబ్ధిదారులకు ప్రభుత్వం మంజూరు చేసిన రూ.43.27కోట్లు డిస్‌ప్లే బోర్డు వైఎస్సార్ సీపీ నాయకులు ఆవిష్కరించారు.

రాజకీయాలకతీతంగా సంక్షేమ పథకాలు

ఆంజనేయపురం(తిరువూరురూరల్): అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడానికి రాష్ట్రప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని తిరువూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ శీలం నాగనర్సిరెడ్డి అన్నారు. తిరువూరు మండలం ఆంజనేయపురంలో మంగళవారం పల్లెకు పోదాం కార్యక్రమం నిర్వహించారు. గ్రామ సచివాలయంలో సంక్షేమ పథకాల వివరాలతో కూడిన డిస్‌ప్లే బోర్డులను నాగనర్సిరెడ్డి ఆవిష్కరించారు. జెడ్పీటీసీ సభ్యుడు యరమల రామచంద్రారెడ్డి, ఆంజనేయపురం ఎంపీటీసీ సభ్యురాలు కోటేశ్వరి, సర్పంచ్ కుటుంబరావు, పీఏసీఎస్ చైర్‌పర్సన్లు నారాయణరావు, సీతారామయ్య, నవీన్‌కుమార్, ఈఓపీఆర్డీ వెంకటరత్నం పాల్గొన్నారు.

రెడ్డిగూడెంలో..

రెడ్డిగూడెం: రెడ్డిగూడెంలో మంగళవారం పల్లెకు పోదాం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన వివిధ అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు తిరుపతిరావు, మండల సచివాలయ కన్వీనర్ భరత్‌కుమార్‌రెడ్డి, సర్పంచ్ రాణీ, వైస్ ఎంపీపీ చాట్ల రాబర్టు పాల్గొన్నారు.



గంపలగూడెం మండలం వినగడపలో అభివృద్ధి, సంక్షేమ పథకాల డీస్‌ప్లే బోర్డును ఆవిష్కరించిన ఎమ్మెల్యే రక్షణనిధి

విస్సన్నపేటలో..

విస్సన్నపేట: అభివృద్ధి సంక్షేమం లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన కొనసాగిస్తూ ప్రజల మనస్సులో సుస్థిర స్థానం సంపాదించారు కాబట్టే మళ్లీ జగనే ముఖ్యమంత్రి కావాలని ప్రజలు కోరుకుంటున్నారని జెడ్పీటీసీ సభ్యుడు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు భీమిరెడ్డి లోకేశ్వరరెడ్డి అన్నారు. స్థానిక సచివాలయం-2 పరిధిలో పల్లెకు పోదాం, ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. అభివృద్ధి సంక్షేమం డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరించారు. అనంతరం వైఎస్సార్ సీపీ జెండాను లోకేశ్వరరెడ్డి ఆవిష్కరించారు. సర్పంచ్ సాధుపాటి నాగమల్లేశ్వరి, సచివాలయ కన్వీనర్ల మండల కన్వీనర్ శివబాజీ, కేడీసీసీబీ డైరెక్టర్ భూక్యా రాణి, వైస్ ఎంపీపీ రెడ్డి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నేడు పల్లెకు పోదాం

విస్సన్నపేట: విస్సన్నపేట గ్రామ సచివాలయం-3 పరిధిలో బుధవారం పల్లెకు పోదాం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఈఓపీఆర్డీ ఝాన్సీరాణి మంగళవారం తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమం సచివాలయం-3 పరిధిలో సాయంత్రం నాలుగు గంటల నుంచి నిర్వహించనున్నట్లు భీమిరెడ్డి లోకేశ్వరరెడ్డి తెలిపారు.



తిరువూరు మండలం ఆంజనేయపురంలో సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న, నాగనర్సిరెడ్డి



నూజివీడులోని సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ త్రివేణీదుర్గ



తిరువూరులో డిస్‌ప్లేబోర్డును ఆవిష్కరిస్తున్న చైర్‌పర్సన్ కస్తూరిబాయి



జి.కొండూరు మండలం కట్టుబడిపాలెంలో పల్లెకు పోదాం, వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం



విస్సన్నపేటలో జెండాను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు లోకేశ్వరరెడ్డి



గుంటుపల్లిలో అభివృద్ధి, సంక్షేమం లబ్ధిదారుల డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరించిన ఎంపీపీ జోత్స్న

గ్రంథాలయాలు ఆధునిక దేవాలయాలు



తిరువూరులో నెహ్రూ చిత్రపటానికి నివాళులర్పించిన చైర్‌పర్సన్ తదితరులు



మైలవరంలో గ్రంథాలయ వారోత్సవాల కార్యక్రమంలో మాట్లాడుతున్న నాగిరెడ్డి



నూజివీడు గ్రంథాలయంలో నిర్వహించిన చిత్రలేఖన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు



విస్సన్నపేటలో వారోత్సవాల పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎంపీపీ మెర్సీవనజాక్షి, నాగమల్లీశ్వరి

మైలవరం:గ్రంథాలయాలు ఆధునిక దేవాలయాలు అని, వీటి సేవలను యువత సద్వినియోగం చేసుకుని ఉన్నత శిఖరాలు చేరవవాలని గ్రంథాలయ అభివృద్ధి కమిటీ గౌరవాధ్యక్షుడు, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత రిటైర్డ్ హెచ్ఎం జెడ్ నాగిరెడ్డి తెలిపారు. మైలవరం శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్సవాలు మంగళవారం ఘనంగా ప్రారంభించారు. జ్యోతి ప్రజ్వలన చేసి అనంతరం మాజీ ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. గ్రంథాలయ కమిటీ అధ్యక్షురాలు కోయ సుధ శ్రీనివాస్,ఉపాధ్యాయులు సురేష్‌బాబు, వై ఉమామహేశ్వరి,కే నారాయణరావు పాల్గొన్నారు.

సమాజంలో వ్యవహరించాల్సిన తీరును నేర్పించాలి

తిరువూరు: భావిభారత పౌరుల్ని తీర్చిదిద్దాల్సిన ఉపాధ్యాయులు వారికి విద్యాబుద్ధులతో పాటు సమాజంలో వ్యవహరించాల్సిన తీరును కూడా నేర్పాలని తిరువూరు నగరపంచాయతీ చైర్‌పర్సన్ గత్తం కస్తూరిబాయి అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో మంగళవారం గ్రంథాలయ వారోత్సవాలను ఆమె ప్రారంభించారు. వైస్ చైర్‌పర్సన్ విజయలక్ష్మి, వార్డు కౌన్సిలర్ రమాదేవి, తెలుగు భాషా వికాస సమితి కన్వీనర్ తోట ఉమా మహేశ్వరరావు, ఎంఈఓ శ్యాంసుందర్, గ్రంథాలయాధికారి పద్మావతి పాల్గొన్నారు.

చాట్రాయిలో..

చాట్రాయి: చనబండ, చాట్రాయి గ్రామాల్లోని గ్రంథాలయాల్లో మంగళవారం గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభమయ్యాయి. అదేవిధంగా దేశ ప్రథమ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ జయంతిని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో చనుబండ సర్పంచ్ విస్సంపల్లి జ్యోతి, వైఎస్సార్ సీపీ నాయకులు వనమా వాసు, గ్రంథాలయాల అధికారులు శ్రీకాంత్, మణికంఠ పాల్గొన్నారు.

నూజివీడులో..

నూజివీడు: గ్రంథాలయాలు ఆధునిక దేవాలయాలని వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు, కౌన్సిలర్ శీలం రాము పేర్కొన్నారు. పట్టణంలోని ప్రథమ శ్రేణి గ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్సవాలను ప్రారంభించారు. అనంతరం విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలను నిర్వహించారు. కౌన్సిలర్ గాదెరెడ్డి శ్రీలత, రిటైర్డ్ ఎంఈఓ వంగల గోవిందరావు, రిటైర్డ్ తెలుగు ఉపాధ్యాయులు శేషయ్య, ప్రముఖ కవి శిఖా ఆకాష్ ప్రసంగించారు. గ్రంథాలయాధికారి బీహెచ్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

గొల్లపల్లి గ్రంథాలయంలో..

నూజివీడు: గొల్లపల్లి గ్రంథాలయంలో మంగళవారం గ్రంథాలయ వారోత్సవాలను స్థానిక హైస్కూల్ హెచ్ఎం పొట్లూరి రాధికా రాణి ప్రారంభించారు. దీనిలో భాగంగా భారతదేశ ప్రథమ ప్రధాని జవర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

విస్సన్నపేటలో..

విస్సన్నపేట: గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారలని ఎంపీపీ పిల్లి మెర్సీవనజాక్షి అన్నారు. స్థానిక గ్రంథాలయంలో గ్రంథాలయాల వారోత్సవం సందర్భంగా ఎంపీపీ పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం బాలలదినోత్సవం సందర్భంగా నెహ్రూ చిత్రపటానికి పూల మాల వేసి నివాళ్లు అర్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ సాధుపాటి నాగమల్లేశ్వరి, వైఎస్సార్‌సీపీ జిల్లా కమిటీ సభ్యుడు సిరసాని ప్రకాష్, పట్టణ అధ్యక్షుడు కుటుంబరావు, రాజేష్, గ్రంథాలయ అధికారి పి.భాను పాల్గొన్నారు.

పెనుగొలనులో..

పెనుగొలను(గంపలగూడెం): గంపలగూడెం మండలం పెనుగొలను శాఖ గ్రంథాలయంలో వారోత్సవాలు ఘనంగా ప్రారంభించారు. ముందుగా సర్పంచ్ ఎస్ లలిత జాతీయ జెండా ఆవిష్కరించారు. నెహ్రూ, అయ్యంకి వెంకటరమణయ్య చిత్రపటాలకు నివాళులర్పించారు. విశ్రాంత ఎంఈఓ వి. శేషిరెడ్డి, సాయిబాబా సేవా కమిటీ సభ్యుడు ఎం. నారాయణరావు, ఉపాధ్యాయులు వెంకటేశ్వరరెడ్డి, దయాకర్, నరసింహారావు, రంగమ్మ, గ్రంథాలయ నిర్వహణాధికారి శ్రీలత పాల్గొన్నారు.

రెడ్డిగూడెంలో..

రెడ్డిగూడెం: స్థానిక శాఖ గ్రంథాలయంలో వారోత్సవాలను మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నెహ్రూ చిత్ర పటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ రాణి, గ్రంథాలయ సిబ్బంది భాస్కర్‌రావు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

క్రీడాకారులు చదువును నిర్లక్ష్యం చేయొద్దు

డెప్యూటీ కలెక్టర్ జ్యోతి సురేఖ

విజయవాడరూరల్: విద్యార్థులు క్రీడలతో పాటు చదువులో రాణిస్తారో అప్పుడే జీవితంలో స్థిరపడతారని ఇటీవల చైనాలో జరిగిన ఆసియా క్రీడల్లో మూడు బంగారు పతకాలు సాధించిన ఇంటర్నేషనల్ ఆర్చరీలో అర్జున అవార్డు గ్రహీత, ఎన్టీఆర్ జిల్లా డెప్యూటీ కలెక్టర్ వెన్నం జ్యోతి సురేఖ అన్నారు. విజయవాడ రూరల్ మండలం నున్న జెడ్పీ ఉన్నత పాఠశాలలో జవహర్‌లాల్ నెహ్రూ జయంతి కార్యక్రమంలో మంగళవారం సురేఖ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తున్నప్పటికీ చదువును నిర్లక్ష్యం చేయకూడదన్నారు. చాలా మంది క్రీడాకారులు ప్రభుత్వంలో ఉద్యోగాలు పొందారని, ఆ తరహాలోనే తనను ప్రభుత్వం డెప్యూటీ కలెక్టర్‌గా నియమించిందన్నారు. అనంతరం ఇటీవల ముగిసిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా, ఆంధ్రప్రదేశ్ అంతర్‌జిల్లాల రెజ్లింగ్ చాంపియన్‌షిప్‌లో బంగారు పతకాలు సాధించిన కార్తీక, శరణ్యకు బంగారు పతకాలు అందజేశారు. అండర్-19 రెజ్లింగ్ ఓవరాల్ చాంపియన్‌షిప్ సాధించిన బాలికల జట్టుకు ఆమె ట్రోఫీని అందజేశారు. అనంతరం నున్న జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం వి.భూపాల్‌రెడ్డి, ఉపాధ్యాయులు, ఓల్డ్ స్టూడెంట్స్ అసోసియేషన్ ప్రతినిధి నరెడ్ల సత్యనారాయణరెడ్డి తదితరులు జ్యోతిసురేఖ, ఆమె తండ్రి సురేంద్రను ఘనంగా సత్కరించారు.



డెప్యూటీ కలెక్టర్ జ్యోతి సురేఖకు సత్కారం

సాదాసీదాగా మండల సమావేశం

ఆగిరిపల్లి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ గోళ్ల అనూష అధ్యక్షతన నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం మంగళవారం సాదాసీదాగా జరిగింది. ఈ సమావేశంలో హౌసింగ్ ఏఈ అలీముల్లా మాట్లాడుతూ మండలంలో 2,380 మంది ఇళ్లు కట్టుకునే లబ్ధిదారులు ఉండగా 1,586 మంది పలు దశల్లో నిర్మాణ దశకు చేరుకున్నాయని, మిగిలినవి త్వరలోనే ప్రారంభిస్తామని తెలిపారు. కలటూరు సర్పంచ్ రాఘవరపు సురేష్ మాట్లాడుతూ గ్రామంలో లో-ఓల్టేజి సమస్యతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని తెలపగా విద్యుత్ శాఖ ఏఈ రామారావు సమస్యను రెండు రోజుల్లో పరిష్కరిస్తామన్నారు. తహసీల్దార్ ఉదయభాస్కర్ మాట్లాడుతూ రెవెన్యూ భూ సర్వేలో అభ్యంతరాలుంటే , రీసర్వే చేయించుకోవచ్చని తెలిపారు. సమావేశానికి హాజరుకాని ఆరు శాఖల అధికారులపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని ఎంపీడీఓ శంకరరావు తెలిపారు. ఎంపీపీ గోళ్ల అనూష మాట్లాడుతూ ఈ నెల 17న నూజివీడులో నిర్వహించనున్న సీఎం జగన్‌మోహన్ రెడ్డి కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు తప్పక హాజరు కావాలని కోరారు.


చదువుతోపాటు సత్ప్రవర్తన అలవర్చుకోవాలి

కనిమెర్ల తండా(మైలవరం): విద్యార్థులు చదువుతో పాటు సత్ప్రవర్తన అలవర్చుకోవాలని లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కే అప్పారావు పేర్కొన్నారు. మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల దత్తత గ్రామం మండలంలోని కనిమెర్ల తండాలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో బాలల దినోత్సవం పురస్కరించుకుని విద్యార్థినులకు కబడ్డీ, వాలీబాల్ పోటీలను మంగళవారం స్కూల్ స్థాయిలో నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు పోటీ ప్రపంచంలో రాణించడానికి ఇటువంటి కార్యక్రమాలు దోహద పడతాయన్నారు. పోటీలలో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల జాతీయ సేవా పథకం అధికారి డాక్టర్ బి. శివ హరిప్రసాద్, ఉమామహేశ్వరరెడ్డి, హెచ్ఎం డి.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నంలో..

ఇబ్రహీంపట్నం: భారతదేశ తొలి ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూ జయంతి సందర్భంగా బాలల దినోత్సవ వేడుకలు మండలంలోని పలు పాఠశాలల్లో మంగళవారం ఘనంగా నిర్వహించారు. కాచవరం ఎంపీపీ పాఠశాలలో ఫాస్టర్ మోగులూరి ఎలీషా విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, రెండు టేబుల్స్, కుర్చీలు బహుకరించారు. మూలపాడు జెడ్పీ పాఠశాలలో రోటరీక్లబ్ ఆఫ్ గొల్లపూడి అధ్యక్షుడు ధనేకుల శ్రీధర్ 200 మంది విద్యార్థులకు ప్లేట్లు, గ్లాసులు పంపిణీ చేశారు.



కనిమెర్ల తండా జెడ్పీ ఉన్నత పాఠశాలలో బహుమతులు పొందిన విద్యార్థులతో ప్రిన్సిపాల్ అప్పారావు

విద్యార్థులకు దుప్పట్ల పంపిణీ

గంపలగూడెం: బాలల దినోత్సవాన్ని గంపలగూడెం మండలంలోని పలు గ్రామాల్లో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ఘనంగా నిర్వహించారు. ఊటుకూరు సిద్దార్థ విద్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి పీవీడీఎల్ నరసింహారావు నెహ్రూ చిత్ర పటానికి నివాళులర్పించారు. గంపలగూడెం కస్తూర్బాగాంధీ పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో తోటమూలకు చెందిన అశ్వత్థామ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో దుర్గ కేక్ ప్లాజా స్వీట్స్ అండ్ బేకరి సౌజన్యంతో పాఠశాలలోని 267 మంది విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఆటల పోటీల్లో విజేతలకు ప్రత్యేక అధికారి వెంకటలక్ష్మీ బహుమతులు పంపిణీ చేశారు.



తిరువూరు జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో వాటర్ ప్యూరిఫైయర్ అందజేస్తున్న ఉపాధ్యాయుడు

తిరువూరులో..

తిరువూరు: పట్టణంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో బాలల దినోత్సవ వేడుకలు మంగళవారం నిర్వహించారు. తిరువూరు జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో విద్యార్థినుల తాగునీటి అవసరాల నిమిత్తం రిటైర్డు ఉపాధ్యాయుడు కందుల విజయకుమార్ వాటర్ ప్యూరిఫైయర్, వ్యాయామోపాధ్యాయిని రజని విద్యార్థులకు క్రీడాదుస్తులను అందజేశారు. శ్రీనిధి, నాగార్జున, నారాయణ పాఠశాలల్లో బాలల దినోత్సవ సందర్భంగా విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించారు.

తిరువూరురూరల్‌లో..

తిరువూరురూరల్: మండలంలోని పలు పాఠశాలల్లో మంగళవారం బాలల దినోత్సవం జరిపారు. లక్ష్మీపురం , చిట్టేల, మల్లేల, ఎర్రమాడు, మునుకుళ్ల, వావిలాల, కాకర్ల, ముష్టికుంట్ల, ఆంజనేయపురం, పెద్దవరం, కోకిలంపాడు గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో భారత తొలి ప్రధాని నెహ్రూ చిత్రపటాలకు విద్యార్థులు, ఉపాధ్యాయులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులకు పోటీలు నిర్వహించి బహుమతి ప్రదానం చేశారు.

ముసునూరులో..

ముసునూరు: స్వతంత్ర్య భారతావనిలో వెలుగులు నింపిన నెహ్రూ నవభారత నిర్మాతగా నిలిచారని ఎంపీడీఓ జి.రాణి అన్నారు. భారత తొలి ప్రధానమంత్రి జవహర్ లాల్ నెహ్రూ జయంతి సందర్భంగా బాలల దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు.